క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



కృష్ణా: మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైక్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పవిత్ర, తనుజ, బాబు, తాయప్ప, తరుణ్, మహేష్, కిరణ్‌లు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం సంతోషి తెలిపారు. కార్యక్రమంలో పీడీ సౌమ్య, నరేందర్, నర్సింహులు, రమేష్, కాశీం అలీ, ఉష, సౌమ్య, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



ధన్వాడ: మండలంలోని కొండాపూర్ లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ స్కీం ప్రోగ్రాం ద్వారా సోమవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులు కృష్ణ మాట్లాడుతూ హెచ్‌ఐవీ నాలుగు రకాలుగా సోకుతుందని, కలుషితమైన సూది సిరంజీలు వాడరాదని, హెచ్‌ఐవీ సోకిన వ్యక్తి నుంచి రక్తం తీసుకోరాదని, హెచ్‌ఐవీ సోకిన వ్యక్తులతో లైంగిక సంబంధం పెట్టుకోరాదని తెలిపారు. ప్రతి ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకొని హెచ్‌ఐవీ ఉంటే ఏఆర్‌టీ మందుల ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌యం శంకరయ్య, భవాని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల పంపిణీ



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామీణ కోట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలు, పలకలు, తదితర సామగ్రి సోమవారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంచ్ మేనేజర్ సంతోష్, మాజీ ఎంపీటీసీ శివ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజనమ్మ, టీచర్ సునిత, తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి అఖండ జ్యోతి ఉత్సవాలు

కోస్గి: పట్టణంలోని చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ, తొగుట వీర క్షత్రీయ సమాజం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, జల్దిబిందె కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, సంఘం యువకులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఊట్కూరు: మండలంలోని లక్ష్మీపల్లి, బాపూర్, తిప్పరాస్‌పల్లి, పులిమామిడి తదితర పాఠశాలల్లో సోమవారం పీఆర్‌టీయూ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులతో సభ్యత్వ చేయించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, భాస్కర్, జగన్నాథ్‌రావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

కృష్ణా: మండలంలోని హిందుపూర్, తైరోడ్డు మధ్యలో సోమవారం సాయంత్రం హిందుపూర్‌కు చెందిన ఆటో బోల్తాపడడంతో అందులో ఉన్న ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో గుడెబల్లూర్‌కు చెందిన కర్రెమ్మతో పాటూ హిందుపూర్ గ్రామానికి చెందిన ఓ చిన్నారి, మరి కొంత మందికి గాయాలయ్యాయి.

పశువులకు టీకాలు వేయించాలి

దామరగిద్ద: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా విధిగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కాన్‌కుర్తి, క్యాతన్‌పల్లి గ్రామాల్లో పశువైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తెల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 519 తెల్లజాతి పశువులకు, 105 నల్లజాతి పశువులకు టీకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ త్రివేణి, గోపాల్ మిత్రలు లాలప్ప, నర్సిమేలు, కన్కప్ప, భీంషప్ప పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని నివారించాలి



మాగనూర్‌లో అయోడిన్ లోపంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



మరికల్‌లో అయోడిన్ ఉప్పు వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కస్తుర్బా గాంధీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

మాగనూర్: అయోడిన్ లోపాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని డాక్టర్ నాగజ్యోతి సూచించారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అయోడిన్ లోపంతో గర్భస్రావం, మృత శిశువు జననం, అతి తక్కువ బరువుతో పిల్లల జననం చోటుచేసుకుంటాయన్నారు. అయోడిన్ ఉన్న ఉప్పును వాడి దీన్ని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజశ్విణి, సూపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్, ఏఎన్‌ఎం సుధారాణి, ఆశా కార్యకర్తలు సరిత, కృష్ణవేణి, అనంతమ్మ , అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

మరికల్: మంచి ఆరోగ్యం కోసం ప్రజలు అయోడిన్ ఉప్పును వాడాలని మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి మరికల్ పట్టణ విధుల గుండా వైద్య సిబ్బంది అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై వైద్య సిబ్బంది అరవింద్, బస్వరాజ్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల కలిగే అనార్థలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సిందుజా మాట్లాడారు. ఎంపీహెచ్‌ఈఓ కతలప్ప, అశోక్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దామరగిద్ద: సంపూర్ణ ఆరోగ్యానికి అయోడిన్ ఎంతో అవసరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కీర్తి రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వెంకటేష్, కిష్టమ్మ, ఫార్మసిస్ట్ వెంకట్రామరెడ్డి, ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కోస్గి: ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నూతనంగా ఏర్పాటు చేస్తున్న బస్సు సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి తోడ్పాటు అందించాలని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి సూచించారు. ఈ మేరకు సోమవారం కోస్గి బస్‌డిపో పరిధిలో నూతనంగా రెండు బస్సు సర్వీసులను ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. నూతన సర్వీసుల్లో ఒక బస్సును కోస్గి నుంచి మద్దూర్ మండలం జాదరావ్‌పల్లి మీదుగా మద్దూర్ వరకు, మరో బస్సును కోస్గి నుంచి గుండుమాల్, కొమ్మూర్ మీదుగా కోయిలకొండ వరకు నడుస్తాయన్నారు. బస్సు సౌకర్యం లేని పల్లెల మీదుగా ప్రారంభిస్తున్న ఈ సర్వీసులను గ్రామాల ప్రజలు ఆదరించాలన్నారు. మరిన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌ఎం ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ లక్ష్మీధర్మ, డీఎం లావణ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, నాయకులు నాగులపల్లి నరేందర్, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, గందె ఓంప్రకాష్, భాను నాయక్, మాస్టర్ శ్రీను, మ్యాకల రాజేష్, ఆర్టీసీ సిబ్బందితోపాటు పలువురు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

మక్తల్: పట్టణంలో వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మల్లికార్జున్, కట్ట సురేష్‌లకు వ్యాపార సంఘాల నాయకులు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. మక్తల్లో ఉన్న రాజస్థాన్‌కు చెందిన వారు లోకల్ వ్యారులను దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మక్తల్‌కు బతుకు దెరువు కోసం రాజస్థాన్ నుంచి వచ్చి మక్తల్‌లో స్థానికంగా ఉన్న వ్యాపారస్తుల పొట్ట గొట్టడం సరైంది కాదన్నారు. అంతకుముందు పట్టణంలో రాంలీలా మైదానం నుంచి నల్లజానమ్మ దేవాలయం మీదుగా బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎల్‌యన్ శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, రావుఫ్, అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రావు, నాగరాజు, రాముగౌడ్, నర్సింహ, పవన్, నాగేష్, నరేష్, విజయ్ పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటకు రైతు భరోసా ఇవ్వాలి

మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఖరీఫ్‌లో రైతు భరోసా ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డిలు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పంపల్లిలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు పెట్టుబడి సహాయం కింద ప్రతి సీజన్‌కు రైతుబంధు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తర్వాత అరకొరగా రైతు రుణమాఫీ చేసి చేతులెత్తేసిందన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. వెంటనే ఖరీఫ్, యాసంగి సాగుకు సంబంధించిన రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమాచారం లేకుండానే ఇందిరమ్మ కమిటీలా?



నర్వ ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నర్వ: మండలంలోని లంకాల్ గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామ ఇందిరమ్మ కమిటీలు ఎలా ఏర్పాటు చేస్తారని బీజేవైఎం జిల్లా నాయకులు వావిళ్ల రవికుమార్‌రెడ్డి అన్నారు. దీనిపై సోమవారం ఎంపీడీఓ శ్రీనువాసులును గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామంలో దండోరా వేయించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి దండోరా వేయకుండా ప్రజలకు తెలియకుండా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను పూర్తి చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్ రామ్, బాలస్వామి, చాకలి హన్మంతు, అయ్యప్ప, చిన్ననర్సింహులు, శేఖర్, తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం జిల్లా కన్వీనర్‌గా శివరాంరెడ్డి



నారాయణపేట: జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా కన్వీనర్‌గా నారాయణపేటకు చెందిన బండి శివ రాంరెడ్డి, కో కన్వీనర్‌గా సూతారి సత్యరఘుపాల్‌రెడ్డిలు నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్‌లో పట్టణ అధ్యక్షులు శ్యాం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన సమావేశానికి రాష్ట్ర నాయకులు మున్నూరు జయపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కొండా పురుషోత్తంరెడ్డిలు హాజరయ్యారు. జిల్లా కన్వీనర్, కో కన్వీనర్‌లతో పాటు అడహక్ కమిటీ సభ్యులుగా యంకి హన్మంతు రెడ్డి, బండి లక్ష్మీకాంత్ రెడ్డి, గట్టు విజయ్‌కుమార్, కే.వెంకట్‌రెడ్డి, సుతారి రాం రెడ్డి, ఆకుతోట వెంకట్‌రెడ్డి, ఆయనగేరి సంతోష్ కుమార్, వారధి నవీన్ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ అడహక్ కమిటీ జిల్లాలో పర్యటించి సభ్యత్వ నమోదు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర నాయకులు మున్నూరు జయపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కొండా పురుషోత్తంరెడ్డిలు తెలిపారు. ఆ తర్వాత పూర్తి స్థాయి జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కులేదు



మక్తల్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మక్తల్‌లో జరిగిన ధర్నాలో చిట్టెం రాంమోహన్‌రెడ్డి తన ఇష్టాను సారంగా సీఎం, మంత్రులను, ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేయడం సరి కాదని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మక్తల్ మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కొళ్ల వెంకటేష్, మాగనూర్ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ రాజప్పగౌడ్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

నారాయణపేట రూరల్: స్థానిక సాయిబాబా దేవాలయంలో సోమవారం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతం చేసినట్లు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రీతిరెడ్డి, రవీందర్, సాయిచందర్‌లు తెలిపారు. సోమవారం వారు ఆర్‌ఎంపీ. పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలకు వచ్చే వ్యాధులు, కీళ్ళనొప్పులు, గుండె సంబంధిత విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నర్సింగ్‌రావు, అర్విద్, చింతలయ్య, రఘు, సత్యకుమార్, శ్రీనివాస్, నారాయణ, సబిత, నాగమణి, మంజుల పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలించిన విద్యాధికారులు



పులమామిడి పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న విద్యాధికారులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షలను సోమవారం ఏఎంఓ రామచంద్రయ్య పరిశీలించారు. పాఠశాలలో సైన్స్‌ల్యాబ్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం, తదితర పనులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు ఆనంద్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రథమ మహాసభలు

నారాయణపేట: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రథమ మహాసభలు జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కాశప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రాధమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఎన్‌పీఆర్‌డీ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా వికలాంగులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలకు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ హాజరవుతారని తెలిపారు.

100 రోజులు.. వెయ్యి కిలోమీటర్లు పాదయాత్ర



మంతన్‌గోడ్ గ్రామంలో విజయ్‌కుమార్

మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్ నుంచి సోమవారం రిటైర్డు డీఈఓ డాక్టర్ విజయ్‌కుమార్ పాదయాత్ర కొనసాగించారు. ఈనెల 1 నుంచి అచ్చంపేట నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ పకృతి పర్యావరణం, వ్యవసాయం, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, లింగన్నగౌడ్, నర్సింహులుగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు ఆర్‌ఐ శ్రీశైలం తెలిపారు. ఆర్‌ఐ వివరాల ప్రకారం.. అడవిసత్యారం గ్రామ పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఆదివారం రాత్రి ఇసుక తరలించి అమ్మపల్లి గ్రామంలో డంపు చేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేయడంతో ఇసుక డంపు దగ్గరకు వెళ్లి పరిశీలించారు. అనుమతి లేకుండా ఇసుకను డంపు చేయడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. డంపు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగిస్తామని వెల్లడించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



దామరగిద్ద పర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ హరిత

దామరగిద్ద: ఎరువుల విక్రయాలను ఎప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌లో రైతుల ఆధార్ అనుసంధానంతో నమోదు చేయాలని వ్యవసాయ అధికారి హరిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్, ఇతర పర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల క్రయ విక్రయాల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ పాస్ స్టాక్, ఫిజికల్ బ్యాలెన్స్‌ను సరిచూసుకోవాలని, రైతుల ఆధార్ నెంబర్‌తో ఈ పాస్‌లో ఎరువుల అమ్మకాలను నమోదు చేయాలన్నారు. పంటలకు సోకే చీడపీడలకు అందించే మందులపై ఆరా తీశారు. పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ పాస్ యాప్ ద్వారా పర్టిలైజర్ స్టాక్ రికార్డులో నమోదు చేసిన వివరాలను సరి చేశారు. ఆమె వెంట ఏఈఓ అజయ్‌కుమార్ ఉన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

మక్తల్: నారాయణపేట జిల్లా స్థాయి పోటీలను మక్తల్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం మక్తల్ ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం మెమొంటోలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం క్రీడాకారులకు ప్రోత్సహించిన విశ్రాంత పీఈటీ గోపాలంను ఎస్‌ఐ సన్మానం చేశారు. కార్యక్రమంలో పీడీ రూప, పీఈటీ అంబ్రేస్, దామోదర్, రమేష్, రేణుక, ప్రసన్న, సౌమ్య, స్వరూప, మీనాకుమారి, పుష్పలత, వేదవీత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు నర్వ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నర్వ: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు నర్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు నారాయణపేట జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి పీఈటీ గోపాలం తెలిపారు. వచ్చే నెల 4 నుంచి 6 వరకు జనగామ జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.ఎంపికైన స్వప్న, శిరీష, అశ్విని, మహేష్, ప్రవళికలను సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోస్గి: జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పుష్పలత తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్వేత, గీతాంజలి, లోకేష్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వారిని జీహెచ్‌ఎం శేఖరయ్య, పీడీ పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జంగమ సమాజం ప్రతినిధులు

కోస్గి: జంగమ సమాజం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఉపాధ్యాయులను, పదోన్నతి పొందిన జంగమ కుల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇంద్రనీలేశ్వర ఆలయ ప్రాంగణంలో 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు, 2024లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నూతన ఉపాధ్యాయులు గద్దం ప్రియాంక(కొడంగల్) మఠం మల్లికార్జున స్వామి (హకీంపేట), పదోన్నతులు పొందిన బనలక్ష్మి (చిట్లపల్లి), ఎన్.సరస్వతి (రుద్రారం), ఎం.భారతి (చిన్న నందిగామ) ఉపాధ్యాయులను సన్మానించారు. జంగమ సమాజం కొడంగల్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, అధ్యక్షులు హంపయ్య స్వామి, ఉపాధ్యక్షులు వినయకుమార్ స్వామి, కోశాధికారి శ్రీశైలం, కార్యదర్శి ఎం.జగదీష్ స్వామి, జిల్లా కన్వీనర్ అమరలింగ స్వామి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కార్మికుల సమస్యలపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాగనూర్: మండల వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడారు. కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ రహ్మతుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బలరాం, సీపీఎం సీనియర్ నాయకులు భరత్‌కుమార్, నర్సింహులు, అశోక్, వెంటకప్ప తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

ధన్వాడ: మండల కేంద్రంలోని కోట పక్క వీధిలో ఆర్కటి వెంకట్‌రెడ్డి ఇంట్లో మధ్యాహ్నం సమయంలో చోరీ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకట్‌రెడ్డి సొంత పని నిమిత్తం జక్లేర్ గ్రామానికి వెళ్లాడు. ఆయన భార్య ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా కార్యకర్త విధులకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళం పగులగొట్టి దుండగులు చొరబడ్డారు. బీరువాలో 3.5 తులాల బంగారం, రూ. 24,500 నగదు చోరీ చేశారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించారు. వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.



విద్యార్థుల గైర్హాజరుపై శ్రద్ధ వహించాలి



గడిమున్కన్‌పల్లి యూపీఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణారెడ్డి

దామరగిద్ద: పాఠశాలకు వచ్చే విద్యార్థులు గైర్హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గడిమున్కన్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రతి విద్యార్థికి స్టీల్ వాటర్ బాటిల్ అందించడం పట్ల అభినందించారు. పరీక్షల నిర్వహణతో విద్యార్థుల సమర్థ్యాలు గుర్తించి బోధించాలన్నారు. ఆయన వెంట ఎచ్‌ఎం నగేష్, సీఆర్‌పీ మహిపాల్ పాల్గొన్నారు.